Cambridge International A Level

**Cambridge International Examinations**
Cambridge International Advanced Level

**TELUGU** | **9690/02**

Paper 2 Reading and Writing | **October/November 2016**

**1 hour 45 minutes**

INSERT

*3736479158-I*

**READ THESE INSTRUCTIONS FIRST**

This Insert contains the reading passages for use with the Question Paper.

You may annotate this Insert and use the blank spaces for planning.
This Insert is **not** assessed by the Examiner.

**ముందుగా ఈ సూచనలను చదవండి**

ఈ లోకూర్పు (ఇన్‌సర్ట్)లో ప్రశ్న పత్రంతో ఉపయోగించ వలసిన రెండు పఠన ఖండికలు ఉన్నాయి.

మీరు ఈ లోకూర్పును వ్యాఖ్యానించ వచ్చు.  ఖాళీ స్థలాన్ని మీ ప్లానింగ్ కొరకు వాడుకో వచ్చు.
ఈ లోకూర్పును పరీక్షకులు మూల్యాంకనం **చేయరు.**

This document consists of **4** printed pages.

DC (ST) 121085/1
© UCLES 2016

CAMBRIDGE International Examinations

**[Turn over**

## విభాగం 1

**పాఠ్యం 1**ని చదివి, ప్రశ్న పత్రం లోని **1, 2, 3 ప్రశ్నలకు** సమాధానాలు రాయండి.

**పాఠ్యం 1**

### నీరు – జీవామృతం

వర్షంలో తడవటం,నీళ్లలో ఆడుకోవటం,జలపాతాలను చూసి మురిసిపోవటం,నదీ తీరాల్లో, సాగర తీరాల్లో విహరించటం ఎంత ఆనందం. ఈ ఆనందానికి కారణం నీరు. నీరులేని ఒక్క రోజుసైనా మనం ఊహించగలమా! భగవంతుడు మనమీద ప్రేమతో అందించిన వరం నీరు. ఆ నీటికి కరువు వచ్చేస్తున్నది.ఆ నీటికోసం యుద్ధాలు జరిగే పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం నీటి వనరులు తరిగిపోవటం, జనాభా పెరిగినట్టు నీటి వనరులు పెరిగే అవకాశం లేదు. కనుక వున్న వాటిని జాగ్రత్తగా వాడుకోవాలి. 2025 నాటికి ప్రపంచ దేశాలలో మూడింట రెండు వంతులమంది తీవ్రమైన నీటి కరువును ఎదుర్కొంటారని ఐక్యరాజ్య సమితి లెక్కవేసింది. "వాటర్ ఫర్ లైఫ్" నినాదంతో 2005 నుంచి 2015 వరకు అంతర్జాతీయ దశాబ్దంగా ప్రకటించింది.

భూమిపై ఉన్న నీటిలో 97.5 శాతం సముద్రాల్లో వుంది. మంచురూపంలో బిగుసుకుపోయినది కొంత. ఇదంతాపోను మనకి నదులు, సరస్సులు, కాలువలు,భూగర్భంలోను వాడుకోవటానికి లభిస్తున్నది ఒక శాతమే. ఆ ఒక్క శాతం నీటిని మనం బంగారం కన్నా జాగ్రత్తగా వాడుకోవాలి. లేదంటే నేడు ధనాన్ని దోచుకు పోతున్నట్టు రాబోయే కాలంలో నీటిని దోచుకుపోయే పరిస్థితులు వచ్చినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

జాతీయ పోషకాహార సంస్థ శాస్త్రవేత్త డా. జగదీష్ ప్రసాద్ వివరించినట్లు నీటి కరువు ఏర్పడటానికి జనాభా పెరగటం ఒకటే కారణం కాదు. రసాయనిక వ్యర్థాలు, మురుగునీరు కలవటం లాంటి ఇతర కారణాల వల్ల కూడా నీటి వనరులు కలుషితమై వాడటానికి పనికిరాకుండా పోతున్నాయి. ఇలా కలుషితమైన నీరు అనారోగ్యాలకు, మరణానికి కూడా కారణమవుతుంది కనుక మరింత జాగ్రత్తగా నీటిని కాపాడుకోవాలి.

బావులు, చెరువులు ఎండిపోతున్నాయని బాధపడుతుండగా వర్షాలు వచ్చేస్తాయి. ఇంకేముంది, రోడ్లు జలమయమవుతాయి. పల్లపు ప్రాంతాలు మునిగిపోతాయి. జలాశయాలు నిండిపోతాయి. ఆహా! సమృద్ధిగా నీళ్ళు ఉన్నాయని ఆనందించేలోపు ఎండాకాలం వచ్చేస్తుంది,మళ్ళీ నీటికి కటకట. ఈ నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే ముందు మనం చేయవలసిన పని నీటిని సంరక్షించుకోవటం. వర్షపు నీరు దాదాపు తొంభైశాతం సముద్రపు పాలవుతుంది.దాన్ని అదుపుచేయగలిగితే నీటి కరువుకు శాశ్వత పరిష్కారం లభించినట్టే. ఈ నీటిని రక్షించటమనేది ముందుగా మనింట్లో ప్రారంభమై ,అది మన వీధికి, గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి, ప్రపంచానికి పాకేట్లు చేయాలి. అదెలాగంటే చెక్ డ్యాంలు నిర్మించటం,ఇంకుడు గుంతలు తవ్వుకోవటం, డాబాలపైభాగం శుభ్రంగా వుంచుకుని అక్కడ పడిన వర్షపునీటిని పైపుల ద్వారా టాంకర్లలో పడేట్టు జాగ్రత్త పడటం.అలా నిల్వవున్న నీటిని మొక్కలకు, చిన్నచిన్న అవసరాలకు వాడుకోవచ్చు. చెరువులు, బావులు ఎప్పటికప్పుడు పూడిక తీస్తుంటే వాటి నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది.

నీటిని పొదుపుగా వాడుకోవాలి. పంపుల్లో లీకేజీలు లేకుండా చూసుకోవాలి. నీటి ధారను వదిలేసి పళ్ళుతోముకోవటం, గిన్నెలు తోమటం, గడ్డం గీసుకోవటం వంటి పనులు చేయకూడదు. చెంబుతో నీళ్ళు పట్టుకుని వాడుకోవచ్చు. అవసరమైనపుడు పంపు విప్పకోవచ్చు. షవర్ల వాడకం తగ్గించాలి.

నగర పాలక అధికారి రంగారావు గారు చెప్పినట్టు పచ్చదనాన్ని పెంచాలి. అడవులు కుంచించుకుని పోకుండా కాపాడుకోవాలి. రసాయనిక వ్యర్థాలు నీటిలో కలవకుండా జాగ్రత్తపడాలి. ఇవి సమిష్టి బాధ్యతగా అందరూ కలిసి చేయాలి. పిల్లలకు నీటి ప్రాధాన్యతను పాఠ్యాంశాలుగా పెట్టి నేర్పించాలి. బిందు సేద్యానికి ప్రాధాన్యతను ఇస్తే సాగునీటిని పొదుపు చేయవచ్చు. జలవనరులను ఆడిట్ చేసి దానికి తగినట్లు పంటలను వేసుకోవాలి.

బతకటానికి నీరు కావాలి. శరీర వ్యవస్థలో నీటికి వున్న ప్రాధాన్యత మాటల్లో చెప్పలేనిది. మన శరీరంలో 70 శాతం నీరే. ఆహారం లేకుండా ఐదారు వారాలు బతకచ్చు. నీరు లేకుండా ఐదారు రోజులు కూడా బతకలేం. ఒంట్లో తగినంత నీరు లేకపోతే ప్రాణానికే ప్రమాదం. అందుకే

రోజుకు రెండు లీటర్ల నీరు తప్పకుండా తాగాలంటారు డాక్టర్లు. శరీరానికి నీటి అవసరాన్ని గురించి డా. జగదీష్ ప్రసాద్ గారి వివరణ ప్రకారం మూత్రపిండాలు శరీరంలోని వ్యర్థాలను నీటిద్వారానే బైటికి పంపుతాయి. తగినంత నీరు లేకపోతే చర్మం పొడిబారిపోతుంది. మనం తీసుకున్న ఆహారంలోని పోషక పదార్థాలను వివిధ భాగాలకు పంపించేది నీరే.

మనం బతకటానికి శక్తినిచ్చే పంటలు పండటానికి నీరు కావాలి. సరైన సాగు నీరు అందకపోతే పంటలు పండవు. దాంతో ఆహారపు కొరత ఏర్పడుతుంది. ఆనకట్టలు నిండకపోతే విద్యుదుత్పత్తి తగ్గిపోతుంది. దాంతో పరిశ్రమలు కుంటి నడక నడుస్తాయి. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుంది. ఇలా మానవ జీవితం నీటితో ముడిపడివుంది. కనుక ప్రాణాధారమైన నీటిని కాపాడుకోవటం అత్యవసరం.

## విభాగం 2

ఇప్పుడు **పాఠ్యం 2ను** చదివి, ప్రశ్న పత్రం లోని **4, 5 ప్రశ్నలకు** సమాధానాలు రాయండి.

**పాఠ్యం 2**

**ఆరోగ్యం – నీరు**

ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. మనిషికి ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకపోతే ఎందుకు పనికిరాడు. కనుక మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. రోగం వచ్చిన తరువాత మందులు వేసుకోవటం కన్నా రోగం రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

అలిసిపోయినపుడు, ఎండలో తిరిగి వచ్చినపుడు ఒక గ్లాసెడు నీరు తాగితే ప్రాణం కుదుటపడుతుంది.అపోలో వైద్యశాలకు చెందిన డా.హరిత ఏమంటారంటే “నీళ్ళలో పోషక పదార్థాలు లేకపోయినా వాటికి ప్రాణాన్ని నిలబెట్టే శక్తి ఉంది.దాహం వేసినపుడు నీళ్ళు తాగకపోతే ప్రాణం విలవిలలాడుతుంది. డీహైడ్రేషన్ ప్రాణం మీదకు తెస్తుంది. మానవ శరీరంలో ఎన్నో పనులు చక్కబెట్టే రక్తంలో 83 శాతం నీరు ఉంటుంది. ఈ నీరు పుణ్యమా అని శరీరంలోని వ్యర్థాలు విసర్జించ బడతాయి. అలా విసర్జించబడకపోతే పేరుకుపోయిన చెత్త విషపూరితంగా మారుతుంది. ఆరోగ్యం అదుపు తప్పుతుంది.అజీర్ణం, మలబద్ధకం, పులిత్రేన్పులు మొదలైన రోగాలు ప్రారంభమవుతాయి. మూత్రపిండాలలో రాళ్ళు ఏర్పడతాయి.”

అటువంటి ప్రాణాధారమైన నీరు కాలుష్యానికి గురైతే, ఆ నీటిని మనం వాడితే ఎంత ప్రమాదం? ఒక్కొక్కసారి ఆ నీటివల్ల మరణం కూడా సంభవించవచ్చు. కనుక మనం తాగే నీటిని, నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకోవాలి. నీటివనరుల కాలుష్యం అంటే సరస్సులు, నదులు, సముద్రాలు, భూగర్భ జలాలు కలుషితం కావటం.ఇవి మనుషుల చర్యల వల్ల కలుషితమవుతాయి.

పూర్వ కాలం నుండి పంచభూతాలైన నీరు, నిప్పు, గాలి, భూమి, ఆకాశం - ఈ ఐదింటిని దైవస్వరూపాలుగా పూజించటం మన సంప్రదాయంలో ఒక భాగం. అందులోనూ నదులను నదీమతల్లులని ఒక ఉన్నతమైన స్థానాన్ని ఇచ్చి పవిత్రంగా చూసేవారు. నదీతీరాల్లో అనేక పుణ్యక్షేత్రాలు వెలిసి ప్రసిద్ధి చెందాయి. అట్లా నదులను పవిత్రంగా చూసినంత కాలం మానవ జీవితం ప్రశాంతంగా గడిచిపోయింది.

కాలక్రమంగా వచ్చిన అనేక మార్పులు ప్రజల జీవన విధానంలో కూడా అనేక మార్పులను తెచ్చాయి. మానవ మనస్తత్వంలో కూడా మార్పులు వచ్చాయి. స్వార్థం, లెక్కలేనితనం,విచ్చలవిడి ప్రవృత్తి,ఎవరెట్లా పోతే నాకెందుకు, “చిన్నినా బొజ్జకు శ్రీరామ రక్ష” అనే లక్షణం పెరిగింది. ముందుచూపు లేకుండా పోయింది. ఈ పద్ధతి వల్ల పర్యావరణానికి ప్రమాదం ఏర్పడింది. పంచభూతాలుగా పూజించబడేవి అనారోగ్యాన్ని పంచే భూతాలుగా మారాయి. అట్లా మానవ జీవితంపై దుష్ప్రభావాన్ని చూపుతున్న వాటిల్లో నీరు ప్రధానమైనది. నీరు అనేక విధాల కాలుష్యానికి గురై అనారోగ్యాలకు కారణమవుతున్నది.

నీటిలో పారిశ్రామిక వ్యర్థాలను, అనేక రకాల రసాయనాలను వదలటం, స్నానాలు చేయటం, బట్టలు ఉతకటం, పశువులను కడగటం, మురుగు నీటిని కాలువలలోకి, నదులలోకి వదలటం, జలమార్గాలలో రవాణా అయ్యే చమురు పదార్థాలు పడటం, ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయటం,బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి, భౌగోళిక మార్పులు, సముద్ర శిథిలాలు, మంచినీటి గొట్టాలలో ఏర్పడే పగుళ్లు ఇలా ఎన్నో కారణాలవల్ల నీటి కాలుష్యం ఏర్పడుతున్నది.

అలా కలుషితమైన నీటిని వాడటం వల్ల డయేరియా, కలరా, హెపిటైటిస్ – ఎ, మలేరియా, పోలియో వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తున్నాయి. ఈ రోగాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మరణాలు, అంగవైకల్యాలు ఏర్పడుతున్నాయి.

కనుక నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇది ఏ ఒక్కరి సమస్యో కాదు. ఇది సమిష్టి బాధ్యత. ప్రభుత్వము, ప్రజలు, స్వచ్ఛందసంస్థలు కలిసికట్టుగా ప్రయత్నం చేయాలి. కాలుష్యాన్ని నివారించాలి. చెత్తను నీళ్ళలోకి విసరవద్దు. చెత్తబుట్టలనే వాడాలి. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. పారిశ్రామిక వ్యర్థాలను నీటిలోకి వదలకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలి. ఇలా నీటి కాలుష్యాన్ని అరికట్టే మార్గాలను వెతుక్కుని జనజీవనాన్ని సుఖమయం చేసుకోవాలి.

To avoid the issue of disclosure of answer-related information to candidates, all copyright acknowledgements are reproduced online in the Cambridge International Examinations Copyright Acknowledgements Booklet. This is produced for each series of examinations and is freely available to download at www.cie.org.uk after the live examination series.

© UCLES 2016